జ్యోతి కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ

# చదరంగంలో బచ్చేది

## అనూగీత

రోగం ముదరగానే, ముందు ఎర్రబడి చర్మం తర్వాత తెల్లబడ్డట్టూ, పదిన్నర అవుతూన్న సమయానికి ఎర్రటి సూర్యుడు తెల్లబడి తీక్షణ తని పుంజుకొన్నాడు.

నగరం నడిబొడ్డులోవున్న పెద్ద భవనపు పన్నెండు అంతస్థుల్లోనూ హడావుడి మొదలైంది. ఆ భవనపు క్రింద ఆరంతస్తులూ బ్యాంక్ ఆఫ్ ఉటోపియావి. ఆ తర్వాత మూడంతస్థులూ ఓ చిట్ ఫండ్ కంపెనీవి. ఆ పైవి కథకి అప్రస్తుతం.

బ్యాంకు, ముందుగేటు, పన్నెండు అడుగుల ఎత్తుగా—హుందాగా రాజభవనపు సింహ ద్వారంలా వుంది. దానిముందు నిలబడ్డ సెంట్రీ కర్తవ్య నిర్వహణకు కంకణం కట్టుకొన్న రాజభటుడిలా శిలలా నిలబడి, కేవలం కనుగుడ్లు తిప్పుతూ దారినపోయే ఆడవాళ్ళను చూస్తోన్నాడు.

దూరం నుంచి 'డబడబా' శబ్దం వినిపించింది.

అంటే చతుర్వేది డబ్బా కారు వస్తోందన్న మాట.

మరునిమిషంలో అదొచ్చి ఫుట్ పాత్ ఎక్కి—ఘోరంగా మూలిగి, ఆగిపోయింది. అందులోంచి క్రిందికి దిగేడు చతుర్వేది. కారుడోరు తాళం వేసేడు. తాళంచేతులు కోటుజేబులో వేసుకొని పర్సుతీసి, పదిపైసల బిళ్ళని గోడకానుకొని కూర్చొనివున్న ముసుగు మనిషివైపు విసిరేడు.

బిళ్ళ తగలగానే మనిషి కొద్దిగా కదిలేడు. ముసుగు పక్కకి తొలగించి ఒంటికన్నుతో చతుర్వేదిని చూసి ఆ కన్నుతోనే నవ్వి "దండాద్దొరా" అన్నాడు.

చతుర్వేది మాట్లాడలేదు.

ఇండియన్ కాంట్రాక్ట్ ఆక్ట్ ప్రకారం, కాంట్రాక్ట్‌ని ప్రతిరోజూ పునర్ చర్చించాల్సిన పనిలేదు. అందుకే అతడు మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయేడు. కుష్టువాడు ముసుగు కప్పుకొన్నాడు మళ్ళీ.

కాంట్రాక్ట్ ప్రకారం చతుర్వేది వాడికి రోజుకి పదిపైసలివ్వాలి. అయితే నెలకి మూడు రూపాయలు అప్పనంగా వదులుకొనేటంత మూర్ఖుడుకాదు చతుర్వేది. కానీ తప్పదు. గ్యారేజీలు ఖాళీలేని కారణంగా, అతడికన్నా సీనియర్లు వున్నవాటిని ఉపయోగించుకొంటున్న కారణంగా అతడు తన కారుని రోడ్డుపక్కగా పెట్టుకోవల్సి వస్తూంది. ఈ విషయమై అతడు మానేజిమెంట్‌ని తెగతిట్టుకొన్నాడు. తన స్టేటస్ సింబల్ అయిన 'కారు' ఎండకి ఎండి, వర్షానికి తడవటం అతడికి బాధకరంగా వుంది. అందులోనూ అది బ్యాంకులో అప్పు తీసుకొని కొన్న కారు....

....ఒక 'లెవల్' దాటిన ఆఫీసర్లకి బ్యాంకే కాదనిస్తుంది. అయితే చతుర్వేది ఆ లెవల్‌కి సరిగ్గా ఒకమెట్టు కిందున్నాడు. అతడిపైన ఇంకా అయిదుగురు సీనియర్లూ, అతనికన్నా బాగా పని చెయ్యగలవాళ్ళూ వుండడంవల్ల అతడికి ఆ పదవి యిప్పుడే లభించేటట్టూలేదు.

చతుర్వేది సీట్లో కూర్చొని, అద్దాల కిటికీలోంచి బైటకి, క్రిందకి చూసేడు. కారు దగ్గిర నిల్చున్న కుర్రవాణ్ణి కుష్టువాడు దూరంగా అదిలిస్తోన్నాడు. ఆ కుర్రవాడు ఏదో అంటు

న్నాడు. అంటూ దూరంగా పరుగెడ్తున్నాడు.

చతుర్వేది సంతృప్తిగా గాలి పీల్చుకొన్నాడు. తన కారుకి రక్షణ కలిగించబడ్తూంది.

* * *

చతుర్వేది కూర్చొనేది బ్యాంక్ మూడో అంతస్తులో, కిటికీ దగ్గిర.

అక్కడ కూర్చొని చూస్తే అతడికి రోడ్డూ, రోడ్డు కవతలవైపున్న తన కారూ స్పష్టంగా కనబడ్తాయి. అతడు కారు అక్కడ పెట్టిన కొత్తలో మాటిమాటికీ దాన్ని చూసుకొనేవాడు. అయితే అతడి సంతృప్తి ఎక్కువసేపు నిలబడ లేదు. కారణం రోడ్డున పోయే కుర్రవాళ్ళు! ఇటూ అటూ వెళ్ళే కుర్రవాళ్ళు కారుమీద చేత్తో రాస్తూపోవటం అతనికి చికాకు కల్గించేది.

ఇంతకన్నా పెద్దప్రమాదం అతడికి మూడు రోజులతరువాత కల్గింది. సాయంత్రం అయ్యేక అతడు వెళ్ళిచూస్తే వెనుక చక్రంలో గాలిలేదు. ఎవడో కొంటెకుర్రాడు చేసిన పని అది.

అతడికేం చెయ్యాలో తోచలేదు. తన కారునెలా రక్షించుకోవాలో అర్థంకాలేదు. ఈ సమస్య అతని దొక్కడిదే. ఎందుకంటే మిగతా వాళ్ళందరి కార్లూ బ్యాంకువాళ్ళిచ్చినవే.

ఈ సమయంలో ఆపద్బాంధవుడిలా కన పడ్డాడు ఆ కుష్టువాడు. 'పది పైసలియ్యి దొరా జూసుకొంటా నీ కారు సంగతి' అన్నాడు. చతుర్వేది అతడి వైపు అనుమానంగా చూసేడు అసలు గాలి విప్పింది వీడేనేమో అని. కానీ అతడి అనుమానం నిరాధారమని ఆ తరువాత తెలిసింది.

వాళ్ళిద్దరూ కాంట్రాక్ట్‌లోకి 'ఎంటర్' అవ గానే చతుర్వేది కారుమీద గీతలు పడటం మానేసినయ్. కుష్టువాడు తనపని జాగ్రత్తగా చేసుకుపోవటంతో సంతృప్తి చెందేడు అతడు. రోజుకి పదిపైసలు ఖర్చుపెట్టటం అంత కష్ట మనిపించలేదు కూడా. కుష్టువాడు కూడా సంతృప్తి చెందినట్టే వున్నాడు. ఇంకేం కావాలి?

సర్వేజనా సుఖినో భవంతు!

* * *

చతుర్వేది కిటికీ అద్దాల్లోంచి బైటికి చూసేడు. మరుక్షణం కుర్చీలో నిటారుగా అయి, మరింత ఉత్సుకతతో అటువైపు చూడ సాగేడు.

కుష్టువాడుతో వేసిన కుర్రాడు మరో ఇద్దర్ని తీసుకొచ్చినట్టున్నాడు. కారుని ముట్టుకోవడానికి ప్రయత్నం చేస్తోన్నారు. వాళ్ళందరి మధ్యా తన కారు ఏమవుతుందో అన్న భయంతో, వాచ్‌మెన్‌తో చెప్పటానికి చతుర్వేది కుర్చీ లోంచి లేచేడు. కానీ అతడు క్రిందికి వెళ్ళే అవసరం లేకపోయింది.

కుష్టువాడు తన వంటిచుట్టూవున్న దుప్పటిని నేలమీదకు జార్చి, వాళ్ళమీదకు వెళ్ళేడు.

అంతే!

ముగ్గురు కుర్రవాళ్ళు క్షణంసేపు అతడి శరీరాన్ని విభ్రాంతితో చూసి బాణంలా అక్కణ్నుంచి పరుగుతీసేరు.

చతుర్వేది కూడా ఒకక్షణం కట్రాటే అయ్యేడు. అతడి వెన్నులో వణుకు పుట్టింది. అంతదూరం నుంచి కూడా ఆ బిచ్చగాడి శరీరం అతడికి గగుర్పాటు కలిగించింది.

పచ్చటి ఎండ అతడి శరీరపు శిధిలమయిన భాగాలమీద ఎర్రగా విశ్లేషిస్తూంది. మాంసపు కండరాలు అక్కడక్కడా వ్రేలాడుతున్నాయి. ముక్కు వుండాల్సిన చోట పెద్దరంధ్రం వుంది. కొబ్బరి పీచులాటి జుట్టు నెత్తిమీద అక్కడక్కడా అతికించినట్టుంది. కుడిభుజం మీద పెద్దకురుపు. అక్కడ తెల్లటిరంధ్రం ఘనీభవించినట్టుంది.

మూర్తీభవించిన అసహ్యంలా వున్నాడతడు.

అయితే అతడు ఆ కుర్రవాళ్ళని బెదరగొట్టిన విధానం మాత్రం చతుర్వేదికి భలేనవ్వు తెప్పించింది. కేవలం దుప్పటి తొలగించి, అతడు నిలబడగానే, పిస్తోలు దెబ్బకి బెదిరిన కాకుల్లా కుర్రవాళ్ళు పరుగెత్తేరు. అతడికి బ్రూస్‌లీ జ్ఞాపకం వచ్చేడు.

అతడు తనలో తను నవ్వుకొంటూ కిటికీ దగ్గిర్నుంచీ కదిలి సీటు దగ్గిరకు వస్తూంటే మేనేజర్ దగ్గిర్నుంచి పిలుపొచ్చింది. అతడు

కొంచెం బెదిరి, తొందర తొందరగా వెళ్ళేడు.


'బ్యాంక్ ఆఫ్ ఉటోపియా' రీజనల్ మేనేజర్ సర్దార్ హరిభజన్ సింగ్ రివాల్వింగ్ చైర్‌లో తీరిగ్గా కూర్చొనివున్నాడు. చతుర్వేదితో కొంచెంసేపు ఆ విషయాలూ యీ విషయాలూ మాట్లాడి—

"ఏమిటి—ఆ ద్వివేది, త్రివేదీలు పనిలో ఏమీ ఇంట్రెస్ట్ చూపించటం లేదుట" అన్నాడు.

చతుర్వేదికి ఒకక్షణం అర్థంకాలేదు. అర్థం కాగానే అతడు ఆనందంతో పొంగిపోయేడు. ద్వివేది, త్రివేదీలు అతడిపైనవున్న సీనియర్ ఆఫీసర్లు; ప్రమోషన్‌కి అతడికన్నా పైన వున్న అయిదుగురిలో-ఇద్దరు.

చతుర్వేది విజృంభించేడు.

త్రివేది, ద్వివేది—బ్యాంకులో సీనియర్ ఆఫీసర్లయ్యుండీ యూనియన్ పన్లలో ఎలా పాల్గొంటున్నారో చిలవలు పలవలుగా వర్ణించేడు. వాళ్ళక్రింద పని ఎంత మిగిలిపోయి



వుంటుంరో వివరించేడు. అలా అయిదు నిము షాలు మాట్లాడి గాలిలో తేలిపోతూ గదిలోంచి బైటకి వచ్చేడు.

అవును మరి రీజనల్ మానేజరంతటి వాడు తనని కాన్ఫిడెన్స్‌లోకి తీసుకొని బ్యాంక్ గురించి 'రహస్యం'గా అడగటం మామూలు విషయమేమీ కాదు.

ఆ ఆనందంలోనే అతడు లంచ్ అవర్‌లో బైటికి వెళ్ళినప్పుడు తన కారుని రక్షించ టంలో ధీరోదాత్తతని ప్రదర్శించినందుకు ఆ బిచ్చగాడికి ఓ అయిదురూపాయలు 'బోనస్'గా ఇచ్చేడు.

అదే ఈ కథని ఓ మలుపు తిప్పింది.

*　　*　　*

కుమారి ప్రతిమకి అరగంట నుంచీ అను మానంగా వుంది పెదాలమీద లిప్‌స్టిక్ చెరి గిందేమో అని. చేస్తున్న కూడిక సగంలో వదిలిపెట్టలేక అలాకే కూర్చొని పనిచేస్తూంది. ఆమె ముందున్న నల్లటి బౌండు పుస్తకం, షిఫాను చీరలో ఇమిడిపోయిన ఇరవై రెండేళ్ళ శరీరంలా వుంది. ఆమె నుదుటిమీద బొట్టు కూడా అరిస్టోక్రాటిక్‌గానే వుంది. ఆమె చేతిలో పెన్ను జపాన్‌ది. ఆమె నోట్లో భాష బ్రిటన్‌ది.

ఇంగ్లీషులో కూడిక పూర్తిచేసి ప్రతిమ వేళ్ళు విరుచుకొంది. తేడా వచ్చిన పదిపైసల పొరపాటూ దొరికింది.

ఆమె పుస్తకం మూసి లేవబోతూ వుండే ఎదుటి డెస్క్‌మీద నీడ పడింది. ఆ నీడ నెమ్మదిగా తన వైపు వస్తూవుండటం చూసి ఆమె తలెత్తింది.

అంతే.

ఆమె కెవ్వున పెట్టిన కేకకి బ్యాంక్ సిబ్బంది అంతా పని ఆపి చప్పున తల తిప్పి చూసేరు.

ఆమె ముందు కుష్టువాడు నిలబడి వున్నాడు.

అతడి భుజంమీద నుంచి దుప్పటి క్రిందికి వేలాడుతూంది. కుడిపక్క, రోగం తినేసిన సగం చెవి కూడా అలానే వేలాడుతూంది. డెస్క్‌మీదున్న గాజు అద్దంలో—భుజం మీదున్న ఎర్రటి రక్తపు మరక ప్రతిబింబి స్తూంది. ఎడమవైపు గాజుకన్ను ప్రతిమనే చూస్తూంది. అతడు చెయ్యి చాపేడు. ముందుకు సాచిన చేతిలో—బొటనవేలు పక్క నుంచి కారిన చీముతో తడిసిన అయిదు రూపాయల నోటుంది.

ఆ అయిదురూపాయల నోటు ము ం దు కొస్తూంటే ఆమె మరోసారి "కెవ్వు"న అరిచింది.

*　　*　　*

చతుర్వేది అంతకు అయిదు నిముషాల క్రితమే వాణ్ణి తన కారుపక్క చూసేడు. వాడు అక్కణ్నుంచి లేవటం చూసి ఆశ్చర్య పోయేడు. అతడి యిన్ని సంవత్సరాల అను భవంలో వాడు ఆ ప్రదేశంలోంచి లేవటం మొదటిసారి చూస్తున్నాడు.

చతుర్వేది చూస్తూ వుండగానే వాడు రోడ్ క్రాస్ చేసేడు. చతుర్వేది కిటికీలోంచి బాగా ముందుకు వంగి అతణ్ణి చూస్తూన్నవాడల్లా అమాంతం స్పృహ తప్పి మూడో అంతస్తు మీదనుంచి క్రింద పడిపోయేవాడే. ఎలానో నిల దొక్కుకొన్నాడు. అయినా—ఉద్వేగం తగ్గ లేదు.

అతడు చూసిన దృశ్యం అటువంటిది మరి....

పదిహేను వందల కోట్ల డిపాజిట్లతో, ఏడు వందల కోట్ల ఋణాల్తో, సంవత్సరానికి నాలుగు కోట్ల లాభాల్తో నడుస్తూన్న 'బ్యాంక్ ఆఫ్ ఉటో పియా'....ఎయిర్ కండిషన్డ్ బిల్డింగ్‌లోకి-ఒక కుష్టువాడు ప్రవేశించటమా?

*　　*　　*

అందరికన్నా ఎక్కువ భయపడింది సెంట్రీ. ప్రతిరోజులాగే అతడు స్టూల్‌మీద కూర్చొని జోగుతున్నాడు. లోపలికి వస్తున్న వాణ్ణి చూడలేదు. ప్రతిమాదేవి కేకతో నిద్ర నుంచి తేరుకొని లోపలికి పరుగెత్తుకొచ్చేడు. కౌంటర్ దగ్గర నిలుచున్న కుష్టువాణ్ణి చూసి క్షణంపాటు నిశ్చేష్టుడైనా, అంతలోనే తేరు కొని చేత్తో తోయబోయి, అంతలోనే వాడు

జననం 1957లో. విద్యాభ్యాసం రోజరీ, రెడ్డీ కాలేజీలలో. ప్రస్తుత నివాసం 332, పి. యస్. నగర్, హైద్రాబాద్-27.

"చదరంగం........" మొదటి కథ. ఆర్థర్ హెయిలీ మనీ ఛేంజర్స్ చదువుతూంటే ఈ ఆలోచన వచ్చింది. అయితే, బ్యాంకులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించటానికి మాత్రం కొద్దిగా కష్టపడవలసి వచ్చింది. ఇలా ఇన్ఫర్మేటివ్‌గా వుండే కథలూ, నవలలూ వ్రాయటంలో వుండే తృప్తి మామూలు ప్రేమ కథల్లో వుండదని నా ఉద్దేశ్యం. నా అభిమాన రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి. ఈమె రచన్లు 'చదివిస్తాయి' కాబట్టి.



పేరునిబట్టి గాక, మొదటి రచనకే బహుమతి నిచ్చిన జ్యోతి సంపాదక వర్గానికి కృతజ్ఞతలు.

—అనూగీత

కుష్టువాడని గుర్తుకొచ్చి, చేతిలోని లాఠీతో తోస్తూ, "జావ్ జావ్—బాహర్ జావ్" అన్నాడు.

"దండాల్దొరా....అయిదు రూపాయలు.... బ్యాంక్‌లో ఏయ్యాల" అన్నాడు వాడు ఆ సెంట్రీయే బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టరన్నంత నమ్రతతో.

వాడి మాటలు అందరికీ స్పష్టంగా వినిపించాయ్.

ఆ హాల్లో వున్న యాభైమందీ ఒకళ్ళ మొహాలొకరు చూసుకొన్నారు.

ఈ లోపులో చతుర్వేది అక్కడికి మెట్లు దిగేడు.

క్షణంలో పరిస్థితిని అర్థం చేసుకొన్నాడు.

"ఇధర్ నై ఆనా....జావ్" అని పురుగుని తోసేసినట్టు తోస్తున్నాడు సెంట్రీ. అసలు వాణ్ణి గేటు దగ్గిరే ఆపు చెయ్యలేదన్న విషయాన్ని యెవరైనా గుర్తిస్తారేమో అన్న భయం వాడిది.

"బాంఛన్........యీ అయిదు రూపాయలు...."

సెంట్రీ ఏదో అనబోతూ వుంటే చతుర్వేది కల్పించుకొంటూ, "మూడయింది. ఇప్పుడేసుకోరు. రేపొద్దున్నరా పో" అన్నాడు.

కుష్టువాడు చతుర్వేదిని చూసి, ఎడారిలో ఒయాసిస్ చూసినవాడిలా దగ్గర కొచ్చి, ఆనందం నిండిన మొహంతో "దండాల్దొరా" అన్నాడు.

చతుర్వేది చప్పున అడుగు వెనక్కి వేసి "సర్లే-సర్లే—రేపు రా పో" అన్నాడు.

"గట్లంటావు....! సర్లె....రేప్పొద్దు గాలె వాస్త" అని వెను దిరిగేడు. నెమ్మదిగా బైటకి వెళ్ళిపోయేడు.

కుమారి ప్రతిమ తేలిగ్గా వూపిరి పీల్చుకొంది. అయిదు నిముషాల్లో ఎవరి పన్లలో వాళ్ళు మునిగిపోయేరు.

అప్పటివరకూ జరిగిందంతా చూస్తూ నిలబడ్డ ఓ వ్యక్తి కూడా, ఇక అక్కడ చేయవలసిందేమీ లేనట్టూ, అక్కడనుంచి కదిలేడు. అతడి చెప్పులు తెగటానికి సిద్ధంగా వున్నాయి. చేతిలో నల్లగౌను చిరగటానికి సిద్ధంగా వుంది.

అతడి పేరు పంతులు.

లాయర్ పంతులు.

* * *

"చతుర్వేది చాలా తెలివితక్కువగా ప్రవర్తించేడు" అన్నాడు త్రివేది మేనేజింగ్ డైరెక్టర్‌తో. "మళ్ళీ రేపు రమ్మన్నాడట ఆ శెప్పర్‌ని. ఇది బ్యాంక్ అనుకున్నాడా—పెళ్ళివారిల్లు అనుకున్నాడా భోజనాల తరువాత రమ్మని చెప్పటానికి. రేపొస్తే ఏం చేస్తాడట? అసలు అతడికెందుకట మధ్యలో. ఆ సెంట్రీ వెళ్ళగొట్టేవాడుగా. గోటితో పోయేదానికి గొడ్డల్తో చెయ్యటం అంటే ఇదే—"

సర్దార్ హరిభజన్‌సింగ్ తెల్లటి గెడ్డం సవరించుకొంటూ అంతా విన్నాడు. తరువాత బెల్ కొట్టి చతుర్వేదిని పిలిపించేడు. చతుర్వేది రాగానే, గదిలో వున్న త్రివేదిని చూసి జరిగినదంతా చెప్పే వుంటాడని గ్రహించేడు.

"ఏమిటి కుష్టువాళ్ళతో అకౌంట్లు ఓపెన్ చేయిస్తున్నావట" అన్నాడు సర్దార్.

"అతడే వచ్చాడు సార్!"

"రేపు రమ్మన్నావుట."

"మరి మన టైమ్ అయిపోయిందిగా ఈ రోజు."

"అంటే—?" మానేజింగ్ డైరెక్టర్ చప్పున తలెత్తి అడిగేడు. "రేపు వాడి దగ్గిర్నుంచి ఆ డిపాజిట్టు తీసుకుందామనేనా?" ఆకాశం కూలినంత ఆశ్చర్యం కనపడింది అతడి కంఠంలో.

"తీసుకోకుండా రిజెక్ట్ చెయ్యగలమా?"

ఈ తిరుగుప్రశ్నని వూహించలేదు. ఓ క్షణం తెల్లబోయి చూసేడు. అతణ్ణి రక్షించవలసిన బాధ్యత తనమీదున్నట్టు త్రివేది అందుకొని అన్నాడు. "ఎందుకు చెయ్యలేం? అసలు వాణ్ణి లోపలికి రానిచ్చేదెవరు?" అని లేచినిలబడ్డాడు. "పర్మిట్ మి సర్. ఇంత చిన్న విషయాన్ని గురించి మీరెందుకూ ఆలోచించటం? నేను తేల్చేస్తాను"

మానేజింగ్ డైరెక్టర్ తలూపేడు.

త్రివేది చతుర్వేదివైపు గెలిచినట్టు చూసి బైటకు నడిచేడు. చతుర్వేదిని గెలవటం ఇంత సులభం అని త్రివేది అనుకోలేదు.

....అయితే అది అంత సులభం కాదని మరుసటిరోజు తేలింది.

* * *

ఆ మరుసటిరోజు త్రివేది ఆజ్ఞ ప్రకారం కుష్టువాడు గేటుదగ్గిరే ఆపుచెయ్యబడ్డాడు.

బ్యాంకు పని ప్రారంభమయి పది నిముషాలయింది. డబ్బు వెయ్యటానికి వచ్చేవాళ్ళూ, తీసుకోవటానికి వచ్చేవాళ్ళతో బ్యాంకు రష్‌గా వుంది.

ఆ టైమ్‌లో కుష్టువాడు తన ప్రదేశం నుంచి లేచి బ్యాంక్‌లోకి వచ్చేడు. మామూలుగానే అతడు గేటుదగ్గిర ఆపుచెయ్యబడ్డాడు.

"నేను లోపలికెళ్ళాల" అన్నాడు వాడు.

"కుదర్ద"న్నాడు సెంట్రీ.

"ఏం? ఎందుక్కుదర్దు."

దూరంగా కాష్ కౌంటర్ దగ్గిర నిలబడ్డ చతుర్వేది, ఇదేమీ తనకు పట్టనట్టూ, లెడ్జర్ చెక్ చేస్తూ, ఓ చెవి ఇటు పారేసి వుంచేడు. నిజానికి ఆ క్రితం రోజు సాయంత్రమే ఆ కుష్టువాడికి యేం మాట్లాడాలో చెప్పివుంచాడు అతడు.

"ఇక్కడ డబ్బుల్దీసుకోరా—"


"తీసోక్కర్ తీసోక్కర్. జావ్."

కుష్టువాడు జోలిలోంచి తెల్లకాగితం తీసి "గట్టని రాసివ్వు" అన్నాడు.

సెంట్రీ తెల్లబోయేడు. ఈ పరిణామాన్ని అతడు వూహించలేదు. ఏం చెయ్యాలో తోచలేదు. రెండో సెంట్రీని చప్పున త్రివేది దగ్గిరకు పంపించేడు.

చతుర్వేది పెదవులమీద సన్నటి చిరునవ్వు వెలిసింది. కనుకొలుకుల్లోంచి ఎడమపక్కగా చూసేడు. భుజానికి సంచి వేలాడేసుకొని, చేతిలో వున్న చిన్న నోట్ బుక్ మీద పెన్సిల్‌తో వ్రాసుకొంటూ పోతున్నాడు ఓ కుర్రవాడు. చతుర్వేది అతడిని చూసి మరింత సంతృప్తిగా నవ్వేడు.

ఈ లోపులో రెండో సెంట్రీ మూడో అంతస్థులో వున్న త్రివేది దగ్గిరకు వెళ్ళి కుష్టువాడు ఇలా రాసిమ్మంటున్నాడనీ, ఏం చెయ్యాలో చెప్పమనీ అడిగేడు.




"అసలు వాడితో మాటలేమిట్రా—మెడ పట్టుకొని గెంటక." అని విసుక్కున్నాడు త్రివేది ఫైళ్ళ మధ్యనుంచి తలెత్తి.

కర్తవ్య నిర్వహణాపరుడైన సెంట్రీ కింది కొచ్చి అలానే చేసేడు. కుష్టువాడు మెట్లమీద జారిపడ్డాడు. అంతలో హాలులో ఒక మూల విజిటర్స్‌కోసం వేసిన బల్లమీద కూర్చొన్న వ్యక్తి లేచి బిగ్గరగా అరిచేడు.

"ఐ ప్రొటెస్టు దిస్ ఇన్ ఎ కోర్ట్ ఆఫ్ లా. ఈ అమానుష చర్యని నేను కోర్టులో సవాలు చేస్తాను. డబ్బు డిపాజిట్ చెయ్యటానికి వచ్చిన ఓ వ్యక్తిని గెంటెయ్యటానికి బ్యాంక్‌కి వున్న అధికారం ఏమిటి?"

హాలులో సూది పడితే వినిపించేటంత నిశ్శబ్దం అలుముకొంది. అప్పటి వరకూ నవ్వుతూ చూస్తున్న చతుర్వేది కూడా ఈ ఆకస్మిక పరిణామానికి విస్తుపోయేడు. పెదాలమీద నవ్వు మాయమైంది. ఈ మలుపుని అతడు వూహించలేదు. ప్రాక్టీసులేని వో లాయరు ఈ పరిణామాన్ని క్రితం రోజు సాయంత్రమే వూహించేడనీ, అందుకే ఈ రోజు ప్రొద్దున్నే వచ్చి కూర్చొన్నాడనీ అతడికి తెలీదు. చాలా చిన్న గొడవతో ఇది తేలిపోతుందనీ, తన పై అధికారి అయిన త్రివేది తెలివితక్కువతనం పై అధికారులకి తెలుస్తుందనీ భావించేడు. అందుకే తనకి తెలిసిన ఓ దిన పత్రిక కరస్పాండెంటుని పిలిచి తమాషా చెయ్యాలనుకొన్నాడు. పేపర్ చివరి పేజీలో చిన్న అక్షరాల్తో ఈ వార్తపడితే, అంతటితో పని సరి అనుకొన్నాడు.

కానీ మొదటి పేజీలోనే పెద్ద అక్షరాల్తో పడ్తుందనుకోలేదు.

* * *

'తాజా పత్రిక' అన్నది తెలుగుదేశంలో అధిక ప్రచారంలో వున్న దినపత్రిక. ఎల్లుండి వార్తల్ని కూడా ముందుగానే ప్రచురించటం దాని ప్రత్యేకత. అందులోనూ అందరికీ ఆసక్తిదాయకమైన విషయాలని మరీ ప్రముఖంగా ప్రచురిస్తుంది—అది అంత పెద్ద వార్త కాకపోయినా! అందుకే ఈ వార్తని మొదటిపేజీ మధ్యలో బాక్సు కట్టి ప్రచురించింది. ఇలా—

## బ్యాంక్‌లోకి కుష్టువాడు ప్రవేశించటానికి అనర్హుడా? లాయర్ సవాల్!

జనవరి 14: నిన్న ప్రొద్దున్న బ్యాంక్ ఆఫ్ ఉటోపియా క్యాష్ కౌంటర్‌లో ఒక చిత్రమైన సంఘటన జరిగింది. ఒక కుష్టువాడు తన జీవితపు పొదుపు మొత్తాన్ని పొదుపు చేయటం కోసం రాగా, అతడిని సెంట్రీలు ఆపు చేసేరు. ఇది చూసిన లాయరొకరు ఈ అమానుష చర్యని గర్హించేరు. ఆ తరువాత లాయర్ పంతులు పత్రికా ప్రతినిధుల్తో మాట్లాడుతూ తను ఈ విషయాన్ని కోర్టు ద్వారానే తేల్చుకోదల్చామని అన్నారు.

* * *

ఈ వార్త పడిన మరుక్షణం తాజా పత్రి కాఫీసుకి వందలమీద వుత్తరాలు రాసాగినయ్. కొత్తపల్లి నుంచీ కోటా రామలింగం, సరోజ పద్మా యింకా వారి మిత్రులూ, గడ్డి అన్నారం నుంచి యాదగిరి వగైరాలే కాక కొత్తగా ప్రాక్టీసు పెట్టిన లాయర్లు, ఒక రిటైర్డ్ జడ్జి కూడా తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చేరు.

దాంతో పత్రిక ఎడిటర్ సబ్ ఎడిటర్ని పిలిచి ఈ విషయాన్ని యిప్పట్లో ఆపుచెయ్య వద్దనీ, ప్రతిరోజూ కొద్దిగా స్థలం దీని గురించి కేటాయించమనీ చెప్పేడు.

* * *

బాంక్ ఆఫ్ ఉటోపియా నాల్గో అంతస్థు బోర్డ్ రూమ్లో అత్యవసర సమావేశం జరిగింది. ఎయిర్కండిషనర్లు నిశ్శబ్దంగా చప్పుడు చేస్తున్నాయి.

రీజనల్ మానేజర్ హరిభజన్సింగ్, ఆపరేషన్స్ మానేజర్ అరోరా, సెక్యూరిటి చీఫ్ జె. జె. విలియమ్స్, త్రివేది, ద్వివేది, చతుర్వేది, యింకా యితర ఎగ్జిక్యూటివ్స్, లీగల్ ఎడ్వైజర్ పండిత్ కూర్చొని వున్నారు. అందరి మొహాల్లోనూ టెన్షన్ కొట్టొచ్చినట్టు కనబడ్తూంది.

రీజనల్ మానేజర్ సెక్యూరిటీ చీఫ్వైపు చూసేడు. చీఫ్ యింగ్లీషులో అన్నాడు. "బాంక్లోకి రానివ్వటానికీ, రానివ్వక పోవటానికి బాంక్కి అధికారం వుంది. న్యూసెన్స్ కేస్ కింద ఆ లాయర్ మీద పోలీసు కంప్లెయింట్ యివ్వొచ్చనీ, తాజా దినపత్రికమీద డామేజెస్ కోసం కోర్టులో కేసు వెయ్యొచ్చనీ నా వుద్దేశ్యం."

"రైట్స్ ఆఫ్ అడ్మిషన్ అన్నది, హోటళ్ళకీ, బార్లకే పరిమితం అని నా వుద్దేశ్యం" అన్నాడు త్రివేది, బొల్లి వున్న చేతివేళ్ళ మధ్య పేపర్ వెయిట్ తిప్పుతూ.

చతుర్వేది మాట్లాడకుండా ప్రేక్షకుడిలా చూస్తున్నాడు.

అందరూ మాట్లాడటం అయిపోయేక లీగల్ అడ్వైజర్ టు ది బ్యాంక్, పండిత్ గొంతు సవరించుకున్నాడు. ఇతడికి అసలు సబ్జెక్టే రాదనీ, కేవలం ఎదుటివాళ్ళని కన్ఫ్యూజ్ చేసి పబ్బం గడుపుకొంటాడని ప్రతీతి.

అతడు చెప్పటం మొదలుపెట్టేడు.

"బ్యాంకింగ్ అనేది ఇవ్వటం—పుచ్చుకోవటం అనే కాంట్రాక్టు ఆక్టుమీద ఆధారపడి వుంటుందన్నది అందరికీ తెలిసిన విషయమే. అటువంటప్పుడు "నేను పుచ్చుకోను" అని బ్యాంకరు అనొచ్చు. కానీ "డిపాజిట్ల" కోసం పేపర్లలో అడ్వర్టైజ్ చేస్తూన్న మన బ్యాంకు, ఒకడు డబ్బు కట్టటానికి వచ్చినప్పుడు "కాదు" అనలేదు. అది ఓపెన్ ఆఫర్ కాబట్టి."

"కానీ చదువురాని వాణ్ణి వప్పుకోనఖ్ఖర్లేదు బ్యాంకు" అన్నాడు ద్వివేది పెద్ద పరిష్కారం కనుగొన్నవాడిలాగా. "సంతకం పెట్టలేని వాడు డిపాజిట్ యెలా చేయగలడు? ఆ కారణంగా అతణ్ణి తిరస్కరించవచ్చు" అని మెచ్చుకోలుకోసం మానేజింగ్ డైరెక్టర్ వైపు చూసేడు.

నిన్న రాత్రంతా ఈ కేసు విషయమే చదివేడు కాబట్టి పండిత్ తడువుకోలేదు.

"కేవలం చదువుకోని కారణంగా ఒక వ్యక్తిని మనం నిరాకరించలేం. ఒక గౌరవనీయమైన వ్యక్తిని యెదురుగా పెట్టుకొని, తన తరుఫున ఎవరైనా ఏజెంటుగా నియమించటానికి కుష్టువాడికి అధికారం వుంది. అయితే ఆ ఏజెంటుతోపాటూ ప్రతిసారీ ఆ కుష్టువాడు కూడా బ్యాంకుకు వస్తూ వుండాలి."

"అది మరీ ఘోరం" అన్నాడు హరిభజన్ సింగ్.

సభ్యులకి జీడిపప్పూ, టీ సర్వ్ చేయబడింది. అవి తింటూ వాళ్ళు ఈ కుష్టు సమస్యను చర్చించసాగేరు.

"ఇది చాలా చిన్న సమస్య అని నా వుద్దేశ్యం" అన్నాడు ద్వివేది. అతడింతవరకూ మాట్లాడలేదు. "—బ్యాంక్ అన్నది పబ్లిక్ ప్లేస్. ఆ ప్రదేశంలోకి అంటురోగులు రాకూడదు అని "హెల్త్ ఆక్ట్" చెబుతుంది. ఇంత చిన్నవిషయానికి "కాంట్రాక్ ఆక్ట్" వరకూ వెళ్ళఖ్ఖర్లేదు" అని గెల్చినట్టూ పండిత్ వైపు చూసేడు.

సాధారణంగా ఏ సంస్థలోనూ పెద్దస్థానాల్లో వుండే ఏ ఇద్దరికీ పడదు.

పండిత్ మొహం పెనంలా మాడిపోయింది.

చతుర్వేది అంతలో చిన్నబాణం వదిలేడు- "కుష్టు అంటురోగమేనా?" అని.

అక్కడున్న వాళ్ళకెవరికీ తెలీదు—అది అవునో కాదో.

ఫస్ట్ సెక్రటరీ టుది మానేజింగ్ డైరెక్టర్, జనరల్ హాస్పిటల్ స్కిన్ స్పెషలిస్ట్‌కి ఫోన్ చేసి, అయిదు నిముషాల్లో కావల్సిన సమాచారం తెప్పించేడు-కుష్టు అంటురోగం కాదని,

సమస్య మళ్ళీ మొదలుకొచ్చింది.

అప్పుడు, అక్కడున్న వాళ్ళందర్లోకీ చిన్నవాడు ఒకడు లేచి నిలబడ్డాడు. అతడు చిన్నప్పుడు కమ్యూనిష్టుల్తోనూ పదవిలోకి వచ్చేక కార్లలోనూ తిరుగుతున్నాడు.

"అసలు మనం ఆ డిపాజిట్టు వప్పుకొంటే నష్టం ఏమిటి?" అంటూ బల్లగుద్దేడు. "ఐదు రూపాయల గురించి కాబట్టి మనం యింత ఆలోచిస్తున్నాం. అదే అయిదు లక్షలిస్తానంటే వాడికి కుష్టుకన్నా వెయ్యిరెట్లు పెద్దరోగమున్నా వెళ్ళి నవ్వుతూ ఆహ్వానిస్తాం."

అది నిజమన్నట్టూ ఎవరూ మాట్లాడలేదు.

హరిభజన్ సింగ్ కొంచెం ఇబ్బందిగా కదిలి "అది కష్టం. ప్రతిమ వప్పుకోవటంలేదు వాడి దిగ్గర్నుంచి డబ్బు తీసుకోవటానికి—"

కమ్యూనిష్టు విస్మయం ప్రకటించేడు. "హూ ఈజ్ షీ? తీసుకోకపోవటానికి ఆవిడెవరు? ఐయామ్ సారీ మన బ్యాంకు—, క్లర్కుల దయాదాక్షిణ్యాలమీద నడుస్తూందని ఇప్పుడే తెలిసింది—"

"ఆవిణ్ని ట్రాన్స్‌ఫర్ చేస్తే—"

"తన ప్రతిష్టకి భంగం కల్గుతుందని ఆవిడ అనుకుంటుంది."

ఈ మాటలకి కమ్యూనిష్టు రెచ్చిపోయేడు. "ఆవిడకంత ప్రాముఖ్యత ఏమిటి?" అని అరిచేడు ఇంగ్లీషులో.

"ప్రాముఖ్యతే...."

"ఎందుకు?"

## నిప్పు - నీరూ

గుండెల్లో
రగులుతూంది
అగ్నిగుండం
కన్నుల్లో
పొరులుతూంది
గంగానది.

—పద్మావతీ గంగాధర్

---

రీజనల్ మేనేజర్ నెమ్మదిగా తలెత్తకుండా అన్నాడు "ఆవిడ ఫైనాన్స్ మినిష్టర్ కూతురు కాబట్టి."

ఆ హాల్లో మళ్ళీ నిశ్శబ్దం అలుముకొంది. పెద్దపెద్ద ఆర్గనైజేషన్స్‌లో చిన్నచిన్న పదవుల్లో వుండే వాళ్ళ వెనుక కూడా పెద్ద 'పవర్' వుంటుందనీ—సంస్థకీలక నిర్ణయాలకి వాళ్ళు చాలా అడ్డుపడ్తారనీ అక్కడ అందరికీ తెలుసు.

చతుర్వేది కొంచెం కదిలి "నాదో సలహా" అన్నాడు. అందరూ అతడివైపు చూసేరు. "కుమారి ప్రతిమని ఆఫీసర్‌ని చేసి, కాష్ దగ్గిర్నుంచి గౌరవంగా పంపించేస్తే" అన్నాడు.

మానేజింగ్ డైరెక్టర్ అతనివైపు మెచ్చుకోలుగా చూసేడు.

* * *

అయితే ఈ సమస్యని లాయర్ పంతులు అంత తేలిగ్గా వదిలిపెట్టదల్చుకోలేదు. కుష్టువాడికి ప్రతిరోజూ పావులా యిచ్చే కమిషన్ మీద. రోజూ వెళ్ళి ప్రొద్దున అయిదు రూపాయలు డిపాజిట్ చేసేటట్టూ, మధ్యాహ్నం వెళ్ళి దాన్ని తిరిగి తీసుకొనేటట్టు ఏర్పాటు చేసేడు.

దాని ప్రభావం మాత్రం బ్యాంకు ఆర్థిక వ్యవస్థ మీద విపరీతంగా పడింది.

రోజురోజుకీ డిపాజిట్లు తగ్గిపోసాగినయ్.

ఈ లోపులో తాజా పత్రిక ఫొటోలతో సహా ప్రచురించసాగింది వార్తనీ.

కుష్టువాడు కౌంటర్ దగ్గిరకి రాగానే

కాకుల్లా కష్టమర్లు చెదిరిపోయేవారు. అతడి చేయి తగిలినచోట తమ చెయ్యి పడకుండా జాగ్రత్తపడేవారు. అయితే పరిస్థితి అక్కడితో ఆగలేదు. 'ఎందుకొచ్చిన బాధ-ఇంకో బాంకు చూసుకొంటే పోలేదా' అని చాలామంది డబ్బు తీసేసుకోసాగేరు. పదిహేను రోజుల్లో బాంక్ డిపాజిట్లు సగానికి సగం తగ్గిపోయేయి.

ఈ విషయమై ఏం చెయ్యాలో రిజర్వ్ బాంక్‌కి సలహా అడుగుతూ వ్రాసిన వుత్తరానికి 'అతి మామూలుగానే' జవాబు రాలేదు.

ఈ పదిహేను రోజుల్లోనూ హరిభజన్ సింగ్ బరువు ముప్పై పవున్లు తగ్గిపోయింది. దిగుల్తో కళ్ళక్రింద గీతలు ఏర్పడినయ్. మనిషి రోజురోజుకి కుదించుకుపోసాగేడు.

అప్పుడు కల్సుకొన్నాడు చతుర్వేది అతణ్ణి.

పదిహేను నిముషాలు రహస్యంగా సమాలోచన్లు జరిపేడు. తాజాపత్రిక ఆఫీసుకి ఫోన్ చేసేడు. ఎడిటర్‌తో కాకుండా తిన్నగా గ్రూపు చైర్మెన్‌తోనే మాట్లాడాడు.

"హల్లో షెట్టీ—"

"హల్లో చతుర్వేదీ-లాంగ్ టైమ్—"

"ఈ సాయంత్రం ఖాళీయేనా—"

షెట్టీ ఛార్టు చూసి, 'ఖాళీయే' అన్నాడు.

"అయితే సాయంత్రం కాక్‌టెయిల్స్‌కి ఎందుకు కలుసుకోకూడదు మనం."

"ష్యూర్."

ఆ సాయంత్రం క్లబ్‌లో వాళ్ళు కల్సుకొన్నారు. అరగంటలో విషయం సెటిల్ అయిపోయింది.

జనాన్ని మరింత దోచుకోవటం కోసం షెట్టీ పెడ్తూన్న మరో జంతర్ మంతర్ బిజినెస్‌కి బ్యాంక్ ఆఫ్ ఉటోపియా గ్యారంటీ ఇచ్చేటట్టూ, కుష్టువాడి విషయం పత్రిక మర్చిపోయేటట్టూ....

ఇది జరిగిన రెండోరోజుకి లాయర్ పంతులు బ్యాంక్ ఆఫ్ ఉటోపియాకి అసిస్టెంటు లీగల్ అడ్వైజర్‌గా నియమింపబడ్డాడు....

కుష్టువాడు మాత్రం చతుర్వేదికి కొద్దిగా ట్రబులిచ్చేడు.

"నేనెందుకు డబ్బు తీసేస్కోవాలి దొరా? ఆరోకలాసు వర్కూ నేనూ సదువుకొన్నా. అదీగాక ఆ పంతులు సెప్పిండు కూడా. నేను డబ్బులుంచాలనుకుంటే ఎవ్వరొద్దన్లేరంట. సూద్దాం ఏమవుతదో—"

చదుర్వేది మొహం చిట్లించి "నేను చెప్తున్నా కదా" అన్నాడు.

"ఆ రోజు నువ్వయిదు రూపాలిచ్చిన్నప్పుడు నేనిన్ని పైసలేంజేస్కోన్దొరా" అంటే "మా బాంకులో ఏస్కో" అన్నది కూడా నువ్వే గదా."

చతుర్వేది గతుక్కుమని "సర్లెసర్లె-ఇప్పుడవన్నీ ఎందుకు" అన్నాడు. "ఇదిగో యీ అయిదురూపాయలు తీసుకొని, ఇంకా విషయం మర్చిపో. ఇక లోపలికి రాకు,"

వస్తానన్నాడు వాడు.

వీధిలో వాడితో ఎక్కువసేపు మాట్లాడటం చతుర్వేది కిష్టంలేదు. అప్పటికే ఒకళ్ళిద్దరు తమ వైపు కుతూహలంగా చూడటం అతడు గమనించేడు. తల వంచుకొని లోపలికి వచ్చేసేడు.

ఆ మధ్యాహ్నమే, 'ముట్టుకొని బెదిరించి' అడుక్కుంటున్నాడన్న కారణంగా పోలీసులు అరెస్ట్‌చేసి వాణ్ణి తీసుకుపోయేరు....విషయం చాలా తేలిగ్గా తేలిపోయింది.

ఈ విషయం ప్రచురించటానికి పత్రికలేదు.

ఈ విషయాన్ని ప్రొటెస్ట్ చెయ్యటానికి లాయర్లేడు.

చతుర్వేది కారు చూడటానికి కాపలాదారు కూడా లేడు.

అయినా పర్లేదు. అతడికి ప్రమోషనొచ్చిన కారణంగా కారునీ డ్రైవర్నీ బ్యాంకువాళ్ళే యిచ్చేరు-పదిరోజుల క్రితవే.

సర్వే జనా సుఖినో భవంతు.